1వ తేదీన అండర్-14 ఖోఖో ఎంపికలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 27: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఖోఖో ఎంపికలు వచ్చేనెల 1న నిర్వహించనున్నామని ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి తెలిపారు. నగరంలోని డీఎస్‌ఏ మైదానంలో ఈ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జోనల్ బృందాలు మాత్రమే ఈ పోటీలో పాల్గొనడానికి అర్హులన్నారు. 2011 జనవరి 1తర్వాత పుట్టిన వారు అర్హులని ఉదయం 10గంటల వరకు మైదానానికి చేరుకోవాలన్నారు. వివరాల కోసం 9347216426 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.



కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న మేయర్, అదనపు కలెక్టర్

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 27: తెలంగాణ వాది, స్వాతంత్ర్య పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి ఉత్సవాలు జరిపారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ నీతూకిరణ్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బీసీ, పద్మశాలి కుల సంఘాల ప్రతినిధులు వినాయక్‌నగర్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన జయంతి కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తుది శ్వాస వరకు అంకితభావం, నిజాయితీగా కృషి చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని ప్రశంసించారు. కేవలం తెలంగాణ ఉద్యమంలోనే కాకుండా పోరాటంలోనూ పాల్గొన్నారని చట్టసభల్లో గళమెత్తి తన పదవులను వదులుకున్న త్యాగశీలి అన్నారు. తెలంగాణ సమాజంలో జన్మించిన ఆణిముత్యం కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. ఆయన త్యాగాలు, పోరాట పటిమ నేటి సమాజానికి తెలియజేసేలా తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా జయంతి ఉత్సవాలను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి రమేష్, నర్సయ్య, పద్మశాలి, బీసీ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



డీఎస్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ అర్వింద్



రియల్ ఢమాల్

- జిల్లాలో రియల్ ఎస్టేట్, అపార్ట్‌మెంట్లపై 'హైడ్రా' ప్రభావం
- రెండు నెలలుగా మందగించిన భూముల క్రయవిక్రయాలు
- ప్లాట్లు, ఇళ్ల కొనుగోళ్లకు వెనకాడుతున్న ప్రజలు
- అన్నీ పరిశీలించాకే కొనుగోలుకు ముందుకు
- అక్రమ నిర్మాణాలపై నజర్ పెట్టిన జిల్లా అధికారులు

నిజామాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): హైదరాబాద్‌లో రెండు నెలలుగా చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలను గుర్తించి 'హైడ్రా' (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) నేలమట్టం చేస్తోంది. ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేస్తోంది. దూసుకొస్తున్న బుల్డోజర్లు, నేలమట్టమవుతున్న భవనాలను చూసి జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీంతో ఆ ప్రభావం జిల్లాలోని రియల్ ఎస్టేట్‌పై పడింది. కొన్ని నెలలుగా కొత్త వెంచర్లు ఏర్పాటవుతున్నా.. గతంలో లాగా క్రయవిక్రయాలు జరగడం లేదు. అపార్ట్‌మెంట్‌లు కూడా భారీగా నిర్మాణం అవుతున్నా.. కొనుగోలుకు ఎవరూ ముందుకు రావడం లేదు. హైడ్రా ఎఫెక్ట్‌తో ప్రతి అంశాన్ని కొనుగోలుదారులు పరిశీలిస్తున్నారు. చెరువు శిఖం, బఫర్, ఎఫ్‌టీఆర్‌ఎల్ వంటి అంశాలను వెంచర్ల యజమానులను అడుగుతూనే.. ఆయా శాఖల అధికారులను సంప్రదిస్తున్నారు. అన్ని వివరాలను కూపీ లాగిన తర్వాతే కొనేందుకు ముందుకు వస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా భారీగా వెంచర్లు

జిల్లాలో కొన్నేళ్లుగా రియల్ ఎస్టేట్ వెంచర్లు భారీగా ఏర్పాటయ్యాయి. నిజామాబాద్ నగరం, బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలతో పాటు ప్రధాన మండలాల పరిధిలో ఈ వెంచర్లు ఎక్కువగా వచ్చాయి. వ్యవసాయ భూములను వెంచర్లుగా ఏర్పాటు చేస్తూ అమ్మకాలు చేస్తున్నారు. ఈ వెంచర్లలో రోడ్లు, పార్కు, స్థలాలు ఉంచడంతో పాటు పెద్ద పెద్ద బ్రోచర్లను తయారు చేసి వినియోగదారులను ఆకర్షించడంతో పాటు కొనే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. నిజామాబాద్ నగరం చుట్టూ భారీ సంఖ్యలో ఈ వెంచర్లు ఏర్పాటు చేశారు. 'నుడా' పరిధితోపాటు ఆర్మూర్, బోధన్, భీంగల్ మున్సిపాలిటీ పరిధిలో కూడా ఎక్కువగా వెంచర్లు ఏర్పాటు చేశారు. డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, పెర్కిట్, నందిపేట, వర్ని, నవీపేట్‌తో పాటు పలు మండలాల్లో ఈ వెంచర్లను ఏర్పాటు చేశారు. వీటిలో కొన్ని నాలా కన్వర్షన్‌లు కూడా చేయలేదు. కొన్ని అనుమతులను కూడా తీసుకోలేదు. దీంతో కొన్నవారు ఇల్లు నిర్మించుకునేందుకు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొన్ని వెంచర్లలో ప్రభుత్వ స్థలాలు, చెరువు శిఖం, చెరువుల భూముల్లో కూడా వెంచర్లను వేశారు. వీటి పరిధిలో కూడా అమ్మకాలు చేశారు. నిజామాబాద్ నగరం పరిధిలో పలు చెరువుల భూములు ఆక్రమణలకు గురయ్యాయి. భారీగా నిర్మాణాలు వచ్చాయి. చెరువు శిఖాలతో పాటు ఎఫ్‌టీఆర్ లెవల్‌లో నిర్మాణాలు జరిగాయి. నిజాంసాగర్ కాలువలతో పాటు చెరువు కాలువలు కూడా ఆక్రమణలకు గురయ్యాయి. బోధన్, భీంగల్ పరిధిలో కూడా చెరువుల భూములు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో చెరువుల పరిధి తగ్గిపోయింది. వెంచర్లే కాకుండా మున్సిపాలిటీల పరిధిలో భాగంగా అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం జరుగుతోంది. గతంలో అపార్ట్‌మెంట్‌లు నిర్మాణం మొదలైనప్పుడే అమ్మకాలు జరిగేవి. కొన్ని బిల్డర్లకు సంబంధించి అపార్ట్‌మెంట్‌లకు ముందుగానే డబ్బులు వచ్చేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి కనబడటం లేదు.

30 శాతానికి పైగా తగ్గిన దందా

నిజామాబాద్‌లో పేరు మోసిన బిల్డర్లకు సంబంధించిన ఇళ్లు కూడా గతంలో మాదిరిగా అమ్మకాలు జరగడం లేదు. నిర్మాణం సమయంలోనే డబ్బులు తీసుకోవడంతోపాటు బ్యాంకు గ్యారంటీలు తీస్తూ రుణాలను కొనుగోలు చేసేవారికి బిల్డర్లు ఇప్పిస్తున్నారు. అయితే వెంచర్‌కు నాలా కన్వర్షన్ ఉందా, అనుమతులు ఉన్నాయా? అన్ని శాఖల అనుమతులు తీసుకున్నారా? రోడ్లు, పార్కులకు స్థలాలు వదిలి పెట్టారా? భవిష్యత్తులో రైల్వే లైన్లు, రోడ్లు ఈ వెంచర్ల గుండా వస్తాయా? అని ఆరా తీస్తూ కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. గతంలో అపార్ట్‌మెంట్ నిర్మాణం మొదలు పెట్టగానే కొనుగోలుకు ముందుకు వచ్చేవారు. ప్రస్తుతం కొనుగోలు చేయడం లేదని నగరానికి చెందిన బిల్డర్లు వాపోతున్నారు. గతంతో పోలిస్తే 30 శాతానికి పైగా అమ్మకాలు తగ్గాయని కొంత మంది బిల్డర్లు వివరించారు. నిర్మాణం చేసి అమ్మకాలు లేకుండా అపార్ట్‌మెంట్‌లు ఉన్నాయని వారు వాపోతున్నారు. వెంచర్ల పరిస్థితి కూడా అంతకంటే ఎక్కువగా ఇబ్బందులు ఉన్నాయని కొంత మంది తెలిపారు. అలాగే నిజామాబాద్ నగర పరిధిలో ఏర్పాటు చేసిన వెంచర్ల గుండానే కొత్తగా రైల్వేలైన్ ఏర్పాటు కానుండడంతో.. ఆ ప్రభావం కూడా ఇతర వెంచర్లపై చూపుతోంది. భారీ ఎత్తున ఖర్చు పెట్టి ప్రచారాలు చేస్తున్నా.. కొనేందుకు మాత్రం ఎక్కువ మంది ముందుకు రావడం లేదు.

సీఎం ప్రకటనతో అధికారుల అప్రమత్తం

హైడ్రా తరహాలో జిల్లాలో కూడా ఒక వ్యవస్థ రానుందని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించడంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. ముందస్తుగా అక్రమ నిర్మాణాలపై నజర్ పెట్టి వివరాలను సేకరిస్తున్నారు. జిల్లా స్థాయిలో నిర్మాణాలపై కొరడా ఝులిపిస్తే రియల్ ఎస్టేట్‌పై కూడా ఆ ప్రభావం మరింత పడే అవకాశం కనిపిస్తోంది. జిల్లాలో గడిచిన రెండు నెలల్లో అపార్ట్‌మెంట్లతో పాటు వెంచర్ల రిజిస్ట్రేషన్లు కూడా కొంతమేర తగ్గినట్లు అధికారులు తెలిపారు.

డీఎస్ సేవలు మరువలేనివి: ఎంపీ

సుభాష్‌నగర్, సెప్టెంబరు 27: డీఎస్ జిల్లాకు చేసిన సేవలు మరువలేనివని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. మాజీ మంత్రి డి.శ్రీనివాస్ జయంతి సందర్భంగా బైపాస్ రోడ్‌లోని ఆయన సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా అర్వింద్ మాట్లాడుతూ.. డీఎస్ తన రాజకీయ ప్రస్థానాన్ని నగరం నుంచి ప్రారంభించి రాష్ట్రస్థాయితో పాటు జాతీయ స్థాయిలో పేరుగాంచారని అన్నారు. నిత్యం ప్రజల ఉన్నతి కోసం పాటుపడిన డీఎస్.. నేడు లేడనే విషయాన్ని అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. సామాన్య కార్యకర్త నుంచి మంత్రి, పీసీసీ అధ్యక్షుడిగా రెండుసార్లు పనిచేసి పార్టీని అధికారంలోకి తెచ్చిన ఘనత ఆయనదేనన్నారు. నగరం నేడు అభివృద్ధి చెందిందంటే నాడు డీఎస్ వేసిన పునాదులేనన్నారు. ముందు చూపున్న మహనీయుడు డీఎస్ అన్నారు. డీఎస్ కొడుకుగా పుట్టడం తన అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ నాయకులు బస్వాలక్ష్మీనర్సయ్య, బాల్కొండ ఇన్‌చార్జి మల్లికార్జున్‌రెడ్డి, బీజేపీ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి, కార్పొరేటర్ మల్లేష్‌యాదవ్, నాయకులు బంటు రాము, కాపర్తి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి లడ్డూ వివాదంపై కేంద్రం సీరియస్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 27: తిరుపతి లడ్డూ కల్తీ వివాదంపై కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లో డీఎస్‌కు నివాళులర్పించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. తిరుపతి లడ్డూ కల్తీపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. సనాతన ధర్మస్థాపన కోసం బోర్డు గతంలోనే ఏర్పాటు కావాల్సిందన్నారు. హిందూ సమాజాన్ని ఐక్యతను దెబ్బతీసే కుట్ర జరుగుతుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ బీజేపీయేనన్నారు. కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. బీఆర్‌ఎస్‌కు ఒక్కరు కూడా ఓటు వేయరని అన్నారు. హైదరాబాద్ నగరంలో 'హైడ్రా' కూల్చివేతలు సెలక్టివ్‌గా కాకుండా సెక్యూలర్‌గా ఉండాలన్నారు. కులం, మతం, ప్రాంతం వంటి బేధాలు చూడవద్దన్నారు. హైడ్రాను జిల్లాలో కూడా విస్తరించాలని అన్నారు.

ఘనంగా సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభం

- నగరంలో సందడి చేసిన సినీ హీరో రామ్, హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్
- షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన ఎంపీ అర్వింద్



ప్రజలకు అభివాదం చేస్తున్న సినీ హీరో రామ్, పక్కన హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్

వివరాలు 7వ పేజీలో...

పల్లెల్లో ఓటరు పంచాయితీ

- ఒకే ఇంట్లో ఓట్లను ఒకే వార్డుకు చేర్చాలని వినతి
- ముసాయిదా జాబితా విడుదల తర్వాత అభ్యంతరాల వెల్లువ
- పరిష్కరిస్తున్న అధికారులు
- నేడు తుది జాబితా

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 27: రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితాను ఈనెల 13న విడుదల చేయగా ఆ తర్వాత అందులో ఉన్న అభ్యంతరాలపై దరఖాస్తులను స్వీకరిస్తుంది. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తికాగా ప్రస్తుతం అధికారులు వాటిని పరిష్కరిస్తున్నారు. ఈనెల 26 వరకు ముసాయిదా జాబితాపై వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించాల్సి ఉంది. ఈనెల 28న గ్రామ పంచాయతీలలో ఓటరు తుది జాబితాను ప్రదర్శించనున్నారు. ముసాయిదా జాబితా వెలువడిన తర్వాత గ్రామ పంచాయతీలలో ఓటర్ల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. వార్డుల వారిగా ఓటర్లు తమ కుటుంబ సభ్యుల ఓట్లన్నీ ఒకే వార్డులో ఉండేలా చూడాలని అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. వార్డు మెంబర్‌గా పోటీ చేయాలని ఆసక్తిగా ఉన్న వారు తమకు అనువైన ఓటర్లను తమ వార్డులోనే ఉంచుకునేలా అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు. తమ కుటుంబ సభ్యులు తమకు దగ్గరి వారు ఇతర వార్డులలో ఉంటే వారిని ఒకే వార్డులో ఉండేలా దరఖాస్తులు చేస్తున్నారు. గ్రామ సర్పంచులుగా, వార్డు మెంబర్లుగా పోటీ చేయాలనుకునే వారు తమకు అనుకూలంగా ఉన్న వారిని జాబితాలో చేర్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు సైతం గ్రామ పంచాయతీలలో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిబంధనల మేరకు మార్పులు చేర్పులు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాగైనా పోటీ చేయాలి, గెలవాలని ఆసక్తిగా ఉన్నవారు మాత్రం ప్రస్తుతం ఓటర్ల జాబితా సవరణల విషయంలో ఆసక్తిని చూపుతున్నారు.

జిల్లాలో 1832 అభ్యంతరాలు..

గ్రామ పంచాయతీలలో ఓటరు ముసాయిదా జాబితా విడుదల తర్వాత జిల్లాలో పెద్ద సంఖ్యలో అభ్యంతరాలు వచ్చాయి. వార్డులలో వచ్చిన అభ్యంతరాలు ఎక్కువగా ఉంటే వాటి ప్రభావం ఆ వార్డు రిజర్వేషన్‌పై ఉండే అవకాశం ఉంది. దీంతో అధికారులు వచ్చిన అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఒక వార్డు నుంచి మరొక



వార్డుకు కొంత మందిని మార్చినప్పుడు అంతకుముందు సహజంగానే ఆ వార్డులో సంబంధిత ఓటరు కమ్యూనిటీ సంఖ్య తగ్గుతుంది. దీంతో ఆ ప్రభావం ఆ వార్డు రిజర్వేషన్‌పై ఉండే అవకాశం ఉంటుంది. ఓటరు జాబితా పరంగా తప్పు ఒప్పులు, అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలన జరిపి పంచాయతీ అధికారులు ముందుకు వెళ్తున్నారు. ఈనెల 28న తుది ఓటర్ల జాబితా ప్రకటించే అవకాశం ఉండగా ఆలోపు అన్ని అభ్యంతరాలను పరిష్కరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 1832 అభ్యంతరాలు రాగా వాటన్నింటిని అధికారులు పరిష్కరించారు.

తుది జాబితా కోసం కసరత్తు..

గ్రామ పంచాయతీలతో పాటు వార్డుల ఎన్నిక కోసం జిల్లా యంత్రాంగం సిద్ధమవుతుంది. ఈ మేరకు గ్రామ పంచాయతీల వారిగా తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తుంది. ఈనెల 13న జిల్లా పంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితాను జిల్లా యంత్రాంగం విడుదల చేసింది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 545 గ్రామ పంచాయతీలలో 5 వేల 20 వార్డులలో మొత్తం 8లక్షల 29వేల 463 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు ముసాయిదా జాబితాను విడుదల చేశారు. ఈనెల 14 నుంచి 21 వరకు గ్రామాల వారిగా ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను స్వీకరించారు. గ్రామ పంచాయతీలో సెక్రెటరీలు, కారోబార్లు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అభ్యంతరాలు పరిష్కరిస్తున్నారు. ఎలాంటి తప్పు ఒప్పులకు తావు లేకుండా తుది జాబితాను రూపొందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

క్రీడాకారుల్లో.. జోష్



కమ్మర్‌పల్లిలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న మండల స్థాయి క్రీడలు
- ఐదేళ్ల తర్వాత పాఠశాలల్లో క్రీడా పోటీల సందడి
- దాతల సహాయంతోనే క్రీడల నిర్వహణ
- ప్రభుత్వ సాయం అంతంత మాత్రమే
- నిర్వహణ భారంతో కొన్ని మండలాలు పోటీలకు దూరం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 24: జిల్లాలో మండల స్థాయి క్రీడల నిర్వహణతో క్రీడాకారుల్లో జోష్ పెరిగింది. 2019 నుంచి ఇప్పటి వరకు మండల స్థాయిలో క్రీడల నిర్వహణ లేక విద్యార్థుల్లోని క్రీడాప్రతిభను బయటకు తీయడానికి ఆస్కారం లేకుండా పోయింది. ఐదు సంవత్సరాల్లో క్రీడా పోటీలు అనేవి లేకుండా ఉన్నా.. ప్రస్తుతం క్రీడల నిర్వహణతో పాఠశాలల్లో సందడి మొదలైంది. ఆకర్షణీయమైన క్రీడా దుస్తులను ధరించి మైదానాల్లో తమ క్రీడా ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. కొన్నేళ్లుగా స్పోర్ట్స్ డ్రెస్ అనేది పాఠశాలకే పరిమితం కాగా, ప్రస్తుతం మైదానానికి చేరుకోవడంతో క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దాతల సాయంతో క్రీడల నిర్వహణ

మండలస్థాయి క్రీడలు నిర్వహణ అనేది ఖర్చుతో కూడుకున్న విషయం. క్రీడలు నిర్వహించేందుకు ప్రారంభం నుంచి ముగిసే వరకూ ప్రతి విషయంలో డబ్బు అవసరం ఉంటుంది. దీంతో మండల క్రీడలను నిర్వహించేందుకు పాఠశాలలు ముందుకు రావడం లేదు. అయితే ఐదేళ్లుగా క్రీడలు నిర్వహణ లేకపోవడంతో ఈసారి ఎలాగైనా క్రీడలు నిర్వహించాలని కొన్ని మండలాలు క్రీడల నిర్వహణ బ్యాధతలను తమ బుజాలపై వేసుకుని క్రీడలను నిర్వహిస్తున్నారు. చాలా మండలాల్లో విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీల సహాయంతో నిర్వహిస్తుండగా మరికొన్ని మండలాల్లో క్రీడాభిమానులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల సహాయంతో క్రీడలను నిర్వహిస్తున్నారు. చాలా మండలాల్లో అలాంటి పరిస్థితి లేకపోవడంతో క్రీడల నిర్వహణ ఊసే లేకుండా పోయింది. దీంతో మండల స్థాయిలో ఉన్న చాలా మంది క్రీడాకారుల ప్రతిభ మండల స్థాయి వరకే ఆగిపోతోంది.

ప్రభుత్వం నుంచి అంతంతమాత్రమే..

మండల స్థాయి క్రీడల నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడలకు ప్రభుత్వం గతంలో ఆర్థికంగా సహాయం చేసేది. అప్పుడు కూడా ప్రభుత్వ సహాయంతోపాటు దాతల సహాయంతో క్రీడలను అట్టహాసంగా నిర్వహించేవారు. ప్రభుత్వ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులను ముఖ్యఅతిథులుగా పిలిచి క్రీడలను గొప్పగా ప్రారంభించేవారు. గతంలో ప్రభుత్వం కొంతమేర సహాయం చేసినా.. ఐదు సంవత్సరాల నుంచి క్రీడల నిర్వహించేందుకు ఎలాంటి ఆర్థిక సహాయం చేయడం లేదు. ప్రస్తుతం మండలానికి పదివేల రూపాయలు ఇవ్వనున్నట్లు జీవో విడుదల చేసినా అవి ఇప్పటికీ అందలేదు. దీంతో మండల స్థాయిలో క్రీడల నిర్వహణ నిర్వాహకులకు భారంగా మారింది. దాతల సహాయంతోనే క్రీడలను నిర్వహిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు తమ సొంత డబ్బులను సైతం వెచ్చించి క్రీడలను నిర్వహిస్తున్నారు. దీంతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి కొంత మొత్తంలో డబ్బులు వసూలు చేసి క్రీడలను నిర్వహిస్తున్నారు. గతంలో డబ్బులు క్రీడల నిర్వహణకు కొంతమేర సరిపోయినా ప్రస్తుతం పదివేల రూపాయలు ప్రభుత్వం ఇచ్చినా.. క్రీడల నిర్వహణకు ఏమాత్రం సరిపోవడం లేదు.

ప్రభుత్వం మరింత సహాయం అందించాలి..

:విద్యాసాగర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు



ప్రభుత్వం నుంచి క్రీడల నిర్వహణకు సరిపోయేంత ఆర్థిక సాయం అందడం లేదు. దాతల సహాయంతో క్రీడలను నిర్వహిస్తున్నాం. పూర్తి స్థాయి క్రీడల నిర్వహణకు ప్రభుత్వం మరింత సహాయం అందించాలి.

అట్టహాసంగా మండలస్థాయి క్రీడలు..

:నాగమణి, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ



జిల్లాలోని పలు మండలాల్లో అట్టహాసంగా మండల క్రీడలను నిర్వహిస్తున్నాం. ఇప్పటికే చాలా మండలాల్లో మండల స్థాయి క్రీడలు జరిగాయి. అక్టోబర్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల నిర్వహణ ఉంటుంది. అప్పటి వరకు జిల్లాస్థాయిలో క్రీడలను నిర్వహిస్తాం.

కోతకు గురైన రోడ్లను పూర్తి చేయండి : ఎమ్మెల్యే

వేల్పూర్, సెప్టెంబరు27: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైన ఆర్అండ్‌బీ వేల్పూర్– రామన్నపేట్ మధ్య రోడ్డును శుక్రవారం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పరిశీలించారు. కోతకు గురైన రోడ్డు వద్ద ఆర్అండ్‌బీ అధికారులను చేస్తున్న తాత్కాలిక మరమ్మతు రోడ్డు పనులను ఎమ్మెల్యే పరిశీలించి ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ఈ రోడ్డు రెండు గ్రామాల మధ్య రాకపోకలు కొనసాగించేందుకు తాత్కాలిక రోడ్డు పునరుద్దణ పనులు త్వరగా చేయాలని, ప్రస్తుతం ఉన్న సింగిల్ రోడ్డు నుంచి డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు ఉన్నందున అందులో నుంచే ఈ కోతకు గురైన రోడ్డులో కల్వర్టు నిర్మాణం చేపట్టేలా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సూచించారు.

రూ.500 చొప్పున బోనస్ చెల్లించాలి

నవీపేట,సెప్టెంబరు 27: రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత వానకాల సీజన్ నుంచి ప్రారంభించనున్న వరిపంటకు క్వింటాలుకు 500రూపాయల చొప్పున చెల్లించే బోనస్‌ను సన్నరకం ధాన్యంతో పాటు దొడ్డురకం ధాన్యానికి సైతం చెల్లించాలని రైతులు కోరారు. శుక్రవారం మండలంలోని నాగేపూర్ సొసైటీ 62వ మహజన సభను ఫకీరాబాద్ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. 2లక్షల రూపాయల వరకు పంట రుణాల మాఫీని వెంటనే అమలు చేయాలని సొసైటీ పరిధిలోని అన్ని గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నాగేపూర్‌లో నూతనంగా నిర్మించిన సొసైటీ భవనంలో ఫర్నిచర్, కంప్యూటర్‌లను కొనుగోలు చేయాలని తీర్మానించారు. అంతకు ముందు 2023-24 ఆడిట్ రిపోర్ట్‌ను మహజన సభలో ఆమోదించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శైలేష్ కుమార్, వైస్ చైర్మన్ సత్యంరెడ్డి, డైరెక్టర్‌లు సాయన్న, ధర్మాజీ, శ్రీనివాస్ రావు, రవీందర్, అంబర్ సింగ్, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

రెంజల్,సెప్టెంబరు 27: రైతులకు సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని చైర్మన్ భూంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దూపల్లి ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ భూంరెడ్డి అధ్యక్షతన సొసైటీ మహజన సభ సమావేశం నిర్వహించారు. సొసైటీకి సంబంధించిన లావాదేవీలు, చిట్టాపద్దులను కార్యదర్శి జీవన్ రెడ్డి సభ్యులకు వినిపించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందుబాటులో సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని రుణమాఫీ వర్తించని రైతులకు మాఫీ చేయాలని, కొత్త క్రాప్ లోన్‌లను అందించాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో విధులు నిర్వహించాలి

నవీపేట,సెప్టెంబరు 27: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఉపాధ్యాయులు తమ విధులను అంకిత భావంతో నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంఈవో గణేష్ రావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న ఇన్‌చార్జి ఎంఈవో గణేష్ రావు, లావణ్య దంపతులను మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్, మండల అధ్యక్షులు భూమయ్య, ప్రధాన కార్యదర్శి శివకుమార్, అశోక్, హన్మాండ్లు, జేదీద్య, గోవర్ధన్, రాధ, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

సిద్దులగుట్టపై స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 27: పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై మున్సిపల్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దులగుట్టపై అయ్యప్ప ఆలయంలో పరిసరాలను శుభ్రపరిచారు. అనంతరం ఆలయ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్, వైస్‌చైర్మన్ శేక్ మున పాల్గొన్నారు.

బస్టాండ్ నిర్మాణ పనులు పున:ప్రారంభం

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 27 : గత ప్రభుత్వ హయాంలో ఎల్లారెడ్డి బస్టాండ్ నిర్మాణం ప్రారంభించి నిధులు లేక అర్థాంతరంగా నిర్మాణ పనులు నిలవడంతో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని 2.5 కోట్లు నిధులు మంజూరు చేసి శుక్రవారం నిర్మాణ పనులను పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో బస్టాండ్ నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చి ప్రయాణీకుల కష్టాలు తీరుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి

రామారెడ్డి, సెప్టెంబరు 27: బీజేపీతోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు ఉప్పల్‌వాయి, ఇసన్నపల్లిగ్రామాలలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్నిచేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ హయంలో దేశం ఎంతో అభి వృద్ధి చెందుతుందని అలాంటి పార్టీలో సభ్యత్వం తీసుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో అసెంబ్లీకన్వీనర్ లింగారావు, జిల్లా ప్రధానకార్యదర్శి రవీందర్‌రావు, మండల అధ్యక్షుడు ఈశ్వర్‌కు మార్, జిల్లా ఉపాధ్యక్షుడు విట్, మాజీ మండల అధ్యక్షుడుగడ్డం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌పై దాడికి ప్రయత్నించిన వ్యక్తిపై కేసు నమోదు

రామారెడ్డి, సెప్టెంబరు 27: రామారెడ్డి పోలీసుస్టేషన్‌పై దాడికి ప్రయత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. గురువారం రాత్రి పోలీసుస్టేషన్‌పై, విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ రాజనర్సయ్యపై మండల కేంద్రానికి చెందిన బిట్లరవి దాడికి ప్రయత్నించాడని తెలిపారు. స్థానికుల సహాయంతో దాడినుంచి హెడ్ కానిస్టేబుల్ తప్పించుకున్నాడని శుక్రవారం రవిని పట్టుకుని కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

బీబీపేట మండలంలో పర్యటించిన ప్రత్యేకాధికారి

దోమకొండ, సెప్టెంబరు 27: బీబీపేట మండలంలోని తుజాల్‌పూర్, శేరిబీబీపేట గ్రామాలలో మండల ప్రత్యేకాధికారి సతీష్ యాదవ్ పర్యటించారు. శేరిబీబీపేటలో అంగన్‌వాడి సెంటర్ శానిటేషన్, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారని తెలిపారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో సెక్రటరీలతో సమావేశం ఏర్పాటుచేసి అన్ని రకాల అభివృద్ధి పనులపై సమీక్షించినట్లు తెలిపారు.పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

పెద్ద కొడప్‌గల్, సెప్టెంబరు 27: పెద్దకొడప్‌గల్ గ్రామ పంచాయతీ పరిధిలో గల కార్మికులకు శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి మాటాడుతూ స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన సుమారు 25 మంది పంచాయతీ కార్మి కులకు పరీక్షలు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్, వైద్యులు ఉమాకాంత్, ఫార్మాసిస్ట్ అనిత, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కౌలాస్ వాగును పరిశీలించిన ఎంపీడీవో

పెద్ద కొడప్‌గల్, సెప్టెంబరు 27: జుక్కల్ మండలంలోని కౌలాస్ గ్రామ శివారులో గల వాగును శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. కౌలాస్ కోటను కలెక్టర్ సందర్శన చేస్తారన్న సమాచారంతో ఎంపీడీవో కోటపైకి వెల్లడానికి వీలవుతుందా లేదా అన్న కోణంలో వాగు వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ప్రస్తుతం వాగులో నీటి ప్రవాహం అధికంగా ఉందని తెలిపారు.

గ్రామ నీటి సహాయకులకు శిక్షణ

బీర్కూర్, సెప్టెంబరు 27 : బీర్కూర్ మండలం రైతునగర్ గ్రామంలోని రైతు వేదికలో శుక్రవారం మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో గ్రామ నీటి సహాయకులకు నీటి పరీక్షలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ తరగతులు అక్టోబర్ ఒకటి వరకు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు. బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాలకు చెందిన గ్రామ నీటి సహాయకులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఉమ్మడి జిల్లాల ఎస్సీ రాజేందర్ కుమార్ పాల్గొని తాగునీటి సరఫరాకు సంబంధించి ఆయా అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈ వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేక అధికారి అనిల్ కుమార్, ఎంపీడీవో భారతి, ఎంపీవో మహబూబ్, ఏఈలు జగదీష్, అశ్విని, గ్రామ నీటి సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్లాస్‌పూర్ క్యాంప్‌లో తాగునీటి కోసం రాస్తారోకో


రాస్తారోకో నిర్వహిస్తున్న కాలనీవాసులు

కోటగిరి, సెప్టెంబరు 27: మండలంలోని ఎక్లాస్‌పూర్ క్యాంప్ గ్రామంలో శుక్రవారం తాగునీటి కోసం కాలనీవాసులు రాస్తారోకో నిర్వహించారు. కోటగిరి, కొత్తపల్లి రహదారిపై ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. గ్రామంలో గత నాలుగు రోజుల క్రితం సింగిల్ ఫేజ్ మోటారు చెడిపోవడంతో తాగునీటి సమస్య తలెత్తింది. ఈ సమస్యపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి కోసం వ్యవసాయ పంపుసెట్ల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తిందని వాపోయారు. మిషన్ భగీరథ నీటి సరఫరా సైతం అంతంత మాత్రంగానే ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోయారు. విషయం తెలుసుకున్న మండల పరిషత్ అధికారులు తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. మిషన్ భగీరథ నీటిని ట్యాంకుకు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించారు.

60 ట్రాక్టర్ల ఇసుక డంప్ సీజ్

కోటగిరి, సెప్టెంబరు 27 : పొతంగల్ మండల కేంద్రంలోని మంజీర బ్రిడ్జి వద్ద అక్రమంగా నిల్వ చేసిన 60 ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను శుక్రవారం తహసీల్దార్ మల్లయ్య సీజ్‌చేశారు. పొతంగల్ గ్రామానికి చెందిన కొంతమంది ఇసుక ట్రాక్టర్ యజమానులు అక్రమంగా ఇసుకను నిల్వచేశారని సమాచారం అందడంతో సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. పొతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్‌ను ఆర్ఐ సాయిలు పట్టుకున్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు తహసీల్దార్ మల్లయ్య మైనింగ్ అధికారులకు సమాచారం అందించగా టిప్పర్‌కు 50వేల జరిమాన విధించారు.

'పొతంగల్‌లో నూతన బస్టాండ్ నిర్మించాలి'

కోటగిరి, సెప్టెంబరు 27 : పొతంగల్ మండల కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్‌ను నిర్మించాలని సీపీఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పొతంగల్ మండల కేంద్రంలో పార్టీ సీనియర్ నాయకులు సీపీఎం జెండాను ఆవిష్కరించిన అనంతరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ పొతంగల్ గ్రామం మండల కేంద్రంగా ఏర్పడి సంవత్సరం కావస్తున్నా ఇప్పటివరకు గ్రామ ముఖచిత్రం మారలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నన్నేసాబ్, నాగన్నాథ్, గణపతి, నాగేశం, సాయాగౌడ్ పాల్గొన్నారు.

క్రీడా పరికరాల పంపిణీ

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 27: మండలంలోని ఉప్లూర్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు క్రిబ్‌కో‌ఎరువుల సంస్థ జిల్లా సేల్స్ అధికారి లక్ష్మీనారాయణ శుక్రవారం క్రీడా పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో సహకారం సంఘం అధ్యక్షుడు రేగుంట దేవేందర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ రైతులు హకార సంఘః కార్యదర్శి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తొర్తి అంగన్‌వాడీలో పోషణ మాసం వారోత్సవాలు

ఏర్గట్ల, సెప్టెంబరు 27 : మండలంలోని తొర్తిలో శుక్రవారం అంగన్ వాడీ కేంద్రంలో పోషణ మాసం వారోత్సవాలు నిర్వహించారు. అందులో భాగంగా తల్లులకు పోషణ ప్రాముఖ్యత, గర్భిణీ బాలింతలకు రక్తహీ నత గురించి తెలియజేశారు. అలాగే చిన్నారులకు పోషక ఆహారాన్ని అంద జేశారు.

మోర్తాడ్: మండలంలోని తిమ్మాపూర్‌లో శుక్రవారం పోషణ మాస మహోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడి టీచర్‌లు అంగన్‌వాడీ కేంద్రాన్ని అందంగా తీర్చిదిద్దారు. తల్లులు, పిల్లలకు పోషకాహారాన్ని అందజేశారు. చిన్న పిల్లలకు ఆటలు ఆడించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక అంగన్‌వాడి టీచర్‌లు, తల్లులు పాల్గొన్నారు.

మోర్తాడ్ పాఠశాలలో బతుకమ్మ ఉత్సవాలు

మోర్తాడ్, సెప్టెంబరు 27: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించారు. విద్యార్థులందరు కలిసి బతుకమ్మను తయారు చేసి ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, ప్రాథమిక ప్రధానోపాధ్యాయుడు బాలరాజు, ఉపాధ్యాయులు, పీఆర్‌టీయులు పాల్గొన్నారు.

వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్, డైరెక్టర్‌లకు సన్మానం


సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్, సెప్టెంబరు 27: వేల్పూర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, డైరెక్టర్ గౌరాయి నరేందర్‌లను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వేల్పూర్ మార్కెట్ కమిటీ నూతనంగా ఎన్నికైన వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, డైరెక్టర్ నరేందర్‌లను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి దామోదర్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కష్టకాలం ఉన్న సమయంలో పార్టీ బలోపేతం కోసం కష్టపడ్డవారికి పార్టీలో గుర్తింపు ఉంటుందనడానికి ఇదే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దామోదర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆత్మరాం, వేల్పూర్ టౌన్ అధ్యక్షుడు మల్లేష్, నాయకులు రమణ, రేవంత్, గంగయ్య, జంగన్న, వెంకటాపూర్ మహిపాల్, రామన్నపేట చిన్నయ్య, సుంకరి మాణిక్యం, మంగళ రమేష్, వినోద్ పాల్గొన్నారు

డిచ్‌పల్లి: నిజామాబాద్ మార్కెట్ కమిటీలో డైరెక్టర్‌గా నియామకం అయిన ముల్లంగి గ్రామానికి గంగారెడ్డిని రూరల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోలసాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. పార్టీ ప్రతినిధులు పెద్దొళ్ల శ్రీను, మిట్టపల్లి రాజన్న, పాల్గొన్నారు.

నీటి సహాయకులకు శిక్షణ తరగతులు

రెంజల్, సెప్టెంబరు 27: మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రెంజల్, ఎడపల్లి మండలాలకు సంబంధించిన గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మధుకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నీరు అందిస్తుందని, గ్రామంలో ఏర్పాటు చేసిన సహాయకులకు అవగాహన కల్పించేందుకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేష్, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ డీఈ మున్నీ నాయక్, సూపరిండెంట్ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

నందిపేట, సెప్టెంబరు 27: హైదరాబాద్‌లోని నార్సింగిలో ఉంటున్న పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను ఉమ్మడ నందిపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఇటీవల కంతంలో వర్షాలకు రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని, పంట ఉత్పత్తులు పొలాల్లో నుంచి రావడానికి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోడ్ల మరమ్మతులకు రూ.20లక్షలు మంజూరు చేయాలని పీసీసీ మహేష్‌కుమార్ గౌడ్‌ను కోరారు. అలాగే తల్వేద లిఫ్ట్ మరమ్మతులను నిధులు మంజూరు చేయించాలని, మూడున్నర కిలోమీటర్ల మేర తారు రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలని వినతి పత్రం అందజేశారు.

నెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

డిచ్‌పల్లి, సెప్టెంబరు 27: జిల్లాస్థాయి నెట్‌బాల్ అండర్-16 పోటీలు మండలంలోని మిట్టపల్లి పాఠశాలలో నిర్వహించినట్లు హెచ్‌ఎం సుశీల్ తెలిపారు. ఈ పాఠశాలలో మిట్టపల్లి, సుద్దులం, అభ్యాస పాఠశాలలు పాల్గొన్నాయని హెచ్‌ఎం తెలిపారు.

ఘనంగా ప్రారంభమైన సీఎంఆర్ షాపింగ్‌మాల్

● షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన ఎంపీ అర్వింద్

● సందడి చేసిన హీరో రామ్, హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్


షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ అర్వింద్

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 27: నిజామాబాద్ నగరంలో సీఎంఆర్ షాపింగ్‌మాల్ అట్టహాసంగా ప్రారంభమైంది. నగరంలోని పూలాంగ్ రోడ్‌లో శుక్రవారం షాపింగ్ మాల్‌ను నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ నీతూకిరణ్‌లతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ ప్రారంభకార్యక్రమంలో సినీ నటుడు రామ్, హీరోయిన్ పాయల్‌రాజ్‌పుత్‌లు సందడి చేశారు. పెద్ద ఎత్తున అభిమానులు షాపింగ్ మాల్ వద్దకు తరలివచ్చారు. అనంతరం మాల్‌లో అన్ని సెక్షన్‌లు తిరుగుతూ అన్ని రకాల డిజైన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎంఆర్ ఫౌండర్ అండ్ చైర్మన్ మావూరి వెంకట రమణ మాట్లాడుతూ తమ సంస్థ గత 40 ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో 34 షోరూంలు ప్రారంభించడం జరిగిందని, రెండు రాష్ట్రాల ప్రజలు ఆదరిస్తున్నారని నిజామాబాద్‌లో 35వ షోరూం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. సీఎంఆర్ షాపింగ్ అంటే ప్రపంచ స్థాయి అనుభూతిని కలిగేలా ఉంటుందని, అన్ని రకాల వేడుకలకు సీఎంఆర్ తగిన విధంగా ఉంటూ అన్ని మోడల్స్ కుటుంబం అంతటికి నచ్చేలా ఉంటాయన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ, బిజెపి నేతలు పల్లె గంగారెడ్డి, బస్వాలక్ష్మీనర్సయ్య, స్థానిక కార్పొరేటర్ హేమలత పాల్గొన్నారు.


తరలివచ్చిన అభిమానులు


మాల్‌లో సినీనటి పాయల్ రాజ్‌పుత్

పంటలకు రూ.500 బోనస్ చెల్లించాలి

● రైతులకు అండగా నిలవాలి

● బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వేల్పూర్, సెప్టెంబరు 27: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు రూ.500 బోనస్ కలుపుకొని మొత్తం నగదు చెల్లించాలని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. వేల్పూర్ మండల కేంద్రంలోని తన నివాసంలో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ఎంఎస్‌పీ(కనీస మద్దతు ధర) ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం మొక్కజొన్న, సోయాబీన్, వరిపంటలను కొనుగోలు చేయాలన్నారు. మొక్కజొన్న పంట 2024-25కి గాను కేంద్ర ప్రభుత్వం అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ నిర్ణయించిన కనీస మద్దతు ధర 2,225 ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్‌తో కలిసి పంటలకు రూ.2,725కు కొనుగోలు చేయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాం త్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మాదిరిగా అన్ని పంటలకు రూ.500 కలుపుకొని చెల్లించాలన్నారు. అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రం ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే క్వింటాలుకు రూ.500 అదనంగా మా ప్రభుత్వం ఇచ్చి పంటలను కొను గోలు చేస్తుందని వరంగల్ రైతు డిక్లరేషన్‌లో చెప్పి మేనిఫేస్టోలో పెట్టారని గుర్తు చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎక్కువ మొత్తంలో మొక్కజొన్న పంట పండించారని, ప్రస్తుతం ఆ పంట చేతికి వచ్చిందన్నారు. ప్రైవేటు వ్యాపారులు మొదట్లో రూ.2600లకు కొనుగోలు చేసి ప్రస్తుతం రూ.2300 నుంచి రూ.2,200లకే కొంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీప్రకారం పంటలను కొనుగోలు చేయకపోతే క్వింటాలుకు రూ.400 నుంచి రూ.500 వరకు రైతులు నష్టపోతారన్నారు. ఐదు ఎకరాలు ఉన్న మొక్కజొన్న రైతు ఎకరానికి 25 క్వింటాళ్లు పండిస్తే రూ.50వేల నుంచి 60వేల వరకు నష్టపోతారన్నారు. ఈ సీజన్ రైతు భరోసా రూ.37,500 కలిపి సుమారు రైతులు రూ.90 వేలు నష్టపోతారన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మొక్కజొన్న పంటను కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌పీ ధరకు అదనంగా రూ.500 ఇచ్చి కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రసవత్తరంగా మండల స్థాయి క్రీడా పోటీలు

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 27:కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని మినీస్టేడియంలో గురువారం ప్రారంభమైన మండల అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రానికి మండలంలోని వివిధ పాఠశాలకు చెందిన క్రీడాకారులు జూనియర్, సబ్‌జూనియర్ బాలబాలికల వాలీబాల్, ఖోఖో, కబడ్డి క్రీడల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడాభిమానులతో స్టేడియం నిండిపోయింది.

బోధన్ మండల విద్యాశాఖ అధికారిగా నాగయ్య

బోధన్ రూరల్, సెప్టెంబరు 27: మండల విద్యాశాఖ అధికారిగా నాగయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తానని, పాఠశాలల నిరంతర పర్యవేక్షణలో ఉంటూ పాఠశాల నిర్వహణలో తలెత్తే ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఎఫ్‌ఎల్ఎన్ ఉన్నతి కార్యక్రమాలు సరైన ప్రణాళిక ప్రకారం అమలు పరుస్తామన్నారు. పదోతరగతి ఫలితాల్లో బోధన్ మండలంలోని రూరల్ పాఠశాలల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా చూస్తామన్నారు.

కోటగిరి: కోటగిరి ఎంఈవోగా ఎన్.శ్రీనివాస్ రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కోటగిరి మండల ఎంఈవోగా వ్యవహరించిన నాగనాథ్ శ్రీనివాస్ రావుకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. మండలంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు తమవంతు కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఎంఈవో నాగనాథ్‌ను ఘనంగా సన్మానించారు.

డిచ్‌పల్లి: మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన యానంపల్లి హెచ్‌ఎం శ్రీనివాస్ రెడ్డిని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మాజీ ఎంఈవో రాజగంగారంలు అభినందించారు. కార్యక్రమంలో రాజగంగారం, ప్రధానోపాధ్యాయులు సంధ్యనాయక్, సుశిల్ ఆనంద్, వెంకటరెడ్డి, అంబర్ సింగ్ పాల్గొన్నారు.

బాసర గోదావరి నీటిలో ధర్మారం మహిళ గల్లంతు


గల్లంతైన కర్రోళ్ల జయ

డిచ్‌పల్లి, సెప్టెంబరు 27: మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కర్రోళ్ల జయ (35) ఇటీవల భర్తతో పాటు ఆమె తల్లి చనిపోగా మిగతా కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం నిర్మల్ జిల్లా బాసరా గోదావరిలో స్నానానికి వెళ్లారు. మధ్యాహ్నం పుష్కరఘాటు వద్ద కృష్ణవేణితో కలిసి నదిలో దిగగా ఒక్కసారిగా నీటిలో ప్రవాహానికి గోదావరిలో కొట్టుకుపోతుండగా కృష్ణవేణిని జాలర్లు కాపాడారు. జయ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. జాలర్లు, పోలీసులు గాలిస్తున్నారు. మృతు రాలికి సింధు, అక్షయ అనే కూతుర్లున్నారు. డిచ్‌పల్లి, బాసరా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంకాపూర్ గ్రామాన్ని సందర్శించిన రైతులు

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 27: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని శుక్రవారం వరంగల్ జిల్లా రైతులు సందర్శించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం వరంగల్, నాబార్డు వారి ఆర్థిక సహాయంతో రైతులు విజ్ఞానయాత్రలో భాగంగా అంకాపూర్ గ్రామానికి వచ్చారు. గ్రామంలో రైతులు సాగుచేస్తున్న పసుపు, ఇతర పంటలను పరిశీలించారు. వ్యవసాయ సాగులో ఇక్కడి రైతులు అవలంభిస్తున్న పద్దతులను అడిగి తెలుసుకున్నారు. అన్ని పంటలలో గడ్డిజాతి నిర్మూలనకు, తెగుళ్ల నివారణకు ఇక్కడి రైతులు చేపడుతున్న చర్యలు, ఖరీఫ్‌లో సోయాబిన్ పంట సాగు, రబీలో మొక్కజొన్న పంట సాగు చేసినప్పుడు నేల ఆరోగ్యం దెబ్బతినకుండా మొక్కజొన్న పంట దిగుబడి పెరుగుతుందని, వారికి గురడిరెడ్డి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అనంత్, నారాయణరెడ్డి, కేకే బాజన్న, నర్సారెడ్డిలు వివరించారు. రైతుల వెంట వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోదన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాములు, వ్యవసాయ విస్తీర్ణాధికారి సవితలు ఉన్నారు.

అక్టోబరు 2న సోయాబీన్

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

● డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి

వేల్పూర్, సెప్టెంబరు 27: వేల్పూర్ క్రాస్‌రోడ్డు వద్ద మార్కెట్ కమిటీ ఆవరణలో అక్టోబర్ 2వ తేదీన సోయాబీన్ పంట కొనుగోలు కేంద్రం ప్రారంభించడం జరుగుతుందని డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం రైతులకు మద్దతు ధర కల్పించడానికి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. క్వింటాలుకు రూ.4892 ప్రభుత్వ మద్దతు ధర అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సోయాబిన్ రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి'

మోర్తాడ్, సెప్టెంబరు 27: మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా మొక్కజొన్న, సోయాలు కొనుగోలు చేయాలని మహాజన సభలో రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం మోర్తాడ్ మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో చైర్మన్ బద్దం అశోక్‌రెడ్డి అధ్యక్షతన మహాజన సభ జరిగింది. మహాజన సభలో కార్యదర్శి కాశీరాం ఆరు నెలల జమ ఖర్చులు సభ్యులకు చదివి వినిపించారు.

అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలి

● పచ్చలనడ్కుడ పీఏసీఎస్ మహాసభలో తీర్మానం

వేల్పూర్, సెప్టెంబరు 27: మండలంలోని పచ్చలనడ్కుడ సొసైటీ పరిధిలో అర్హులైన రుణమాఫీ కానీ రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని వేల్పూర్ మండల పచ్చలనడ్కుడ మహాజన సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. శుక్రవారం మండలంలోని పచ్చలనడ్కుడ పీఏసీఎస్ ఆవరణలో మహాజన సభ సమావేశాన్ని సొసైటీ చైర్మన్ గడ్డం లింబారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతు రుణమాఫీలో భాగంగా రూ.2లక్షల ఇప్పటి వరకు మూడు విడతలలో రూ.90లక్షల 66వేల835లను తన సొసైటీ పరిధిలో రైతులకు రుణామఫీ అయిందన్నారు. తిరిగి వారికి క్రాప్‌లోన్స్ ఇవ్వడం జరిగిందన్నారు. సొసైటీ పరిధిలో మొత్తం లోన్ సభ్యులు 665మంది ఉండగా కేవలం 200మందికి మాత్రమే రుణమాఫీ అయిందన్నారు. మిగిలిన రుణమాఫీ వారికి కూడా రుణామాఫీ చేయాలన్నారు. కొత్తగా క్రాప్‌లోన్స్ రూ.8 లక్షల వరకు ఇవ్వడం జరిగిందన్నారు. రైతులకు ఎల్లప్పుడు యూరియా, కాంప్లెక్స్ ఎరువులు, విత్తనాలు రైతులకు ఇబ్బంది కలుగకుండా సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సెక్రెటరీ స్వామి, డైరెక్టర్‌లు గట్టవతల నర్సారెడ్డి, తలారి శేఖర్, కొమ్ముల రాజన్న, అంకం నాగమల్లేష్, సొసైటీ పరిధిలోని గ్రామాల రైతులు, సొసైటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి


కమ్మర్‌పల్లిలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 27: ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ ఆశయ స్ఫూర్తికి అనుగుణంగానే మనందరం పయనించాలని మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కమ్మర్‌పల్లిలో జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చౌట్‌పల్లి చౌరస్తా వద్ద గల బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకు ముందు మండల ఎంపీడీవో రాజా శ్రీనివాస్, కార్యదర్శి శాంతి కుమార్, పసుపు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త పాల్గొన్నారు.

రుద్రూరు : మండలంలోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో శుక్రవారం ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను నిర్వహించారు. కళాశాల డీన్ డాక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నేటి యువత కొండ లక్ష్మణ్ బాపూ జీని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రుద్రూరులో చేనేత సహకార సంఘం ఆధ్వర్యం లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఏర్గట్ల : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపివో శివచరణ్, ప్రవీణ్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

నందిపేట: మండల కేంద్రంలోని బజార్ కొత్తూర్ రోడులో కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవా లను నిర్వహించారు. కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి బోగ రాము, నాయకులు చింత బాల గంగాధర్, కొండ గంగాధర్, సంబారు గిరిధర్, మాన్పూర్ భూమేశ్వర్, భూస శ్రీనివాస్, స్వర్గం నర్సయ్య, బొద్దు మురళి, విఠల్ తదితరులు ఉన్నారు.

డిచ్‌పల్లి: కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఆశోక్, మహేశ్, రాణి, కులుదిప్, శ్రీనివాస్, సంజీవ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: భీమ్‌గల్ పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మంలో మున్సిపల్ చైర్మన్ కన్నెప్రేమలత సురేం ధర్, వైస్‌చైర్మన్ భగత్ పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: పట్టణంలోని తట్టికోట గల్లీలో గల శ్రీ మార్కండేయ పద్మశాలి సంఘంలో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్షులు గంగుల దేవిదాస్ మాట్లాడారు.

నవీపేట: ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.

'ప్రభుత్వ భూమి వర్సిటీ పర్యవేక్షణలోనే ఉంది'

డిచ్‌పల్లి, సెప్టెంబరు 27 : కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆదేశాల మేరకు డిచ్‌పల్లి తహసీల్దార్ రవి కుమార్ సర్వే చేశారు సర్వే నంబరు 267, 334,265,277,278,603లోని 501.09 ఏకరాలు సర్వే 264లో 69.29 ఎకరాలు, సర్వేనంబర్లతో మొత్తం భూమి ప్రభుత్వ ఆదీనంలో ఉందని, ఈ భూమి హద్దులు అప్పటి వైస్ చాన్స్‌లర్ స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ భూమిలో ఎలాంటి నిర్మాణాలు జరగడం లేదన్నారు.

బోధన్ రూరల్ సీఐగా విజయబాబు

బోధన్‌రూరల్, సెప్టెంబరు 27: బోధన్ రూరల్ సీఐగా విజయబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన కోల నరేష్‌కుమార్ హైదరాబాద్ హైడ్రా విభాగానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నిజామాబాద్ వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న విజయబాబు బోధన్ రూరల్ సీఐగా బదిలీపై వచ్చి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

సాగర్ కాలువలో వ్యక్తి శవం లభ్యం

వర్ని,సెప్టెంబరు 27: చందూర్ మండల శివారు నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటరీ కాలువలో శుక్రవారం పొతంగల్ మండల కేంద్రానికి చెందిన ప్యాకల మొగులయ్య(44)అనే వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నట్లు ఎస్ఐ కృష్ణకుమార్ తెలిపారు. మృతుడు మొగులయ్య ఈ నెల 23న సాయంత్రం నుంచి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని, అతని భార్య కోటగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

వర్ని, సెప్టెంబరు 27: మండలంలోని శ్రీనగర్‌లో కొత్త లీలావతి (41)అనే గృహిణి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ కృష్ణకుమార్ తెలిపారు. మృతురాలు కొన్నేళ్లుగా తలనొప్పితో బాధపడుతూ ఉందని, ఆ బాధను భరించలేక మనస్తాపంతో తన ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శవ పంచనామా అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

కల్లుగీత కార్మికులకు శిక్షణ

మోస్రా, సెప్టెంబరు 27 : నిజామాబాద్ రూరల్ మండలంలోని కొత్తపేట్ గ్రామంలో అబ్కారీ శాఖ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ శాఖల ఆధ్వర్యంలో కొత్తపేట గ్రామంలోని తాటివనంలో నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని గీత కార్మికులకు కాటమయ్య రక్షణ పరికరాల ఉపయోగంపై నిపుణులతో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్కారీ శాఖ ఎస్ఐ మల్లేష్ మాట్లాడుతూ గీత కార్మికులు చెట్టు ఎక్కేటప్పుడు ప్రమాదవశాత్తు జారిపడి ప్రాణాలు కోల్పోకుండా ఈ కిట్లు ఉపయోగపడతాయన్నారు.

'పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి'

రుద్రూరు, సెప్టెంబరు 27: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రుద్రూరు ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం ఆయన రుద్రూరు మండల సమీకృత కార్యాలయం ఆవరణలో నాటిన మొక్కలను ఎంపీవో లక్ష్మారెడ్డితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్, ఉపాధిహామీ పాల్గొన్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో దోమల నివారణపై తక్షణ చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల కార్యదర్శులకు ఎంపీడీవో సురేష్‌బాబు సూచించారు. శుక్రవారం రుద్రూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన కార్యదర్శులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మారెడ్డి, ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భోజనం సరిగా లేదని పీడీఎస్‌యూ నిరసన

వర్ని,సెప్టెంబరు 27: మండల కేంద్రంలోని వడ్డేపల్లి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నభోజనం సరిగా ఇవ్వడం లేదంటూ పీడీఎస్‌యూ నాయకులు శుక్రవారం ఆందోళనకు దిగారు. పాఠశాలలో కాలిపోయిన అన్నం నాసిరకం కూరగాయలు వడ్డిస్తూ విద్యార్థులను ఆసుపత్రుల పాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పదవుల కోసం పైరవీలు చేసే ప్రధానోపాధ్యాయులు బాధ్యతలు చేపట్టాక వారి బాగోగులు గాలికి వదిలేయడం సిగ్గుచేటని విద్యార్థి సంఘం వర్ని అధ్యక్షులు బార్దవల్ శేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

బోధన్‌రూరల్, సెప్టెంబరు 27: బోధన్ పట్టణంలో గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. కొత్త బస్టాండ్ సమీపంలో వెళ్తున్న లాల్‌అహ్మద్ అనే వ్యక్తిని లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆచన్‌పల్లికి చెందిన లాల్ అహ్మద్ సైకిల్‌పై వెళ్తుండగా పక్క నుంచి వెళ్తున్న కారును తప్పించబోయి లారీ వెనుక టైర్ కింద పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ బాధితుడిని బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాధితుడు లాల్‌అహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి లారీని అదుపులోకి తీసుకున్నామన్నారు.

వరల్డ్ టూరిజం డే

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 27: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం వరల్డ్ టూరిజం డేను నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ తొంటి దేవన్న విద్యార్థులకు వరల్డ్ టూరిజం ప్రాముఖ్యతను, టూరిజంలోని రకాలు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వేణుప్రసాద్, వైస్‌ప్రిన్సిపాల్ ఎన్.సునీత, వెంకటేశ్వర్, అంబార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్లూర్ పాఠశాలలో క్రీడా పరికరాల పంపిణీ

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 27: మండంలోని ఉప్లూర్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు క్రిబ్‌కో ఎరువుల సంస్థ జిల్లా సేల్స్ అధికారి లక్ష్మీనారాయణ శుక్రవారం క్రీడా పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు రేగుంట దేవేందర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ రైతులు కార్యదర్శి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

భీమ్‌గల్‌రూరల్, సెప్టెంబరు 27: మండలంలోని బడాభీమ్‌గల్ గ్రామానికి చెందిన దేవిజ్యోతి తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. ఆమెది నిరుపేద కుటుంబం వైద్యఖర్చులు చెల్లించడానికి ఇబ్బందిగా ఉండడంతో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డిని సంప్రదించగా సీఎం సహాయనిధి నుంచి రూ.లక్ష ఎల్‌వోసీ ఇప్పించడం జరిగిందన్నారు. ఆపద సమయంలో ఆదుకున్న సునీల్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని కుటుంబసభ్యులు తెలిపారు

మండల సమావేశానికి హాజరుకాని అధికారులు

ఎడపల్లి, సెప్టెంబర్ 27: మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా కొనసాగింది. ఒకవైపు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు లేకపోవడం, మరోవైపు గ్రామాల ప్రత్యేక అధికారులుగా నియమితులైన వివిధ శాఖల అధికారులు కొంతమంది రాకపోవడం, వచ్చినా ఆకాస్త మంది ప్రజల సమస్యలపై చర్చించడంతో ఆదినుంచి అంతం వరకు సర్వసభ్య సమావేశం పస లేకుండా కొనసాగింది. ఎడపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి మండల అభివృద్ధి అధికారి శంకర్ అధ్యక్షత వహించారు. ప్రజాపాలన ముగిసి ప్రత్యేక పాలన ఏర్పడ్డాక మొదటిసారిగా నిర్వహించిన సమావేశానికి మండల ప్రత్యేక అధికారి హాజరు కాక పోవడం కొసమెరుపు. కొంతమందే అధికారులు పాల్గొని వివరణ ఇచ్చారు. ఇందులో భాగంగా మండలంలో ఉన్న అన్ని గ్రామ పంచాయితీలలో పారిశుద్ధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామని, ఓటరు సవరణ జాబితాను ఆయా గ్రామ పంచాయితీలలో ప్రదర్శించామని మండల పంచాయితీ అధికారి మన్‌మోహన్ శర్మ సమావేశంలో వివరించారు.

క్రీడా సామగ్రిని అందజేసిన పూర్వ విద్యార్థులు

నవీపేట,సెప్టెంబరు 27: మండలంలోని జడ్పీహెచ్‌ఎస్ నాళేశ్వర్ పాఠశాలకు క్రీడా సామగ్రిని శుక్రవారం పూర్వవిద్యార్థులు అందజేశారు. 2012-13విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వవిద్యార్థులు పాఠశాలకు ఖోఖో, వాలీబాల్, చెస్ వంటి క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదీప్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల సంక్షేమం కోసం పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 27: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు బలహీన వర్గాల సంక్షేమం కోసం పోరాడిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపుజీ అని వక్తలు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపుజీ జయంతిని పురస్కరించుకుని వక్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లుఅర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నరేష్‌రెడ్డి, తారకం, రాజేశ్వర్, శ్రీనివాస్, మధు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు. అలాగే ప్రాంతీయ గ్రంథాలయం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ జయంతిని ఘనంగా జరిపారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ప్రజల కోసం ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమం సహాయక గ్రంథపాలకులు మధు, జీవన్‌రావ్ పాల్గొన్నారు.

రాష్ట్ర సాధనలో బాపూజీ పాత్ర మరువలేనిది..

సుభాష్‌నగర్: కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్‌లో గల కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తాద్రి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు తెలంగాణ రాష్ట్ర సాధన పోరులో బాపూజీ పాత్ర మరువలేనిదన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీని ఆదర్శంగా తీసుకొని పద్మశాలిలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పుల్లం హన్మాండ్లు, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గుజ్జరాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



నగరంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులు

సబ్బండ వర్గాల జీవితాల్లో వెలుగు నింపిన మహోనీయుడు..

ఖిల్లా: సబ్బండ వర్గాల జీవితాల్లో వెలుగును నింపిన మహోనీయుడు కొండా లక్ష్మణ్ బాపుజీ అని అదపసే డీ సీపీ (అడ్మిన్) బి.కోటేశ్వర్‌రావ్ అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపుజీ జయంతిని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ(ఏఆర్) శంకర్‌నాయక్, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, సీటీసీ ఏసీపీ సయ్యద్‌మస్తాన్‌అలీ, ఆఫీస్ సూపరిటెండెంట్ శంకర్, బషీర్ పాల్గొన్నారు.

ధర్పల్లి: మండల కేంద్రంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, మాజీ సర్పంచ్ మిట్టపల్లి గంగారెడ్డి, సుభాష్, సురేందర్‌గౌడ్, గంగాదాస్, మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిలుక రాజు, ధర్పల్లి పద్మశాలి సంఘం అధ్యక్షుడు పాము నారాయణ, భూమేష్, డాక్టర్ నందు, క్యాదరి నారాయణ పాల్గొన్నారు.

ఎంపీపీ కార్యాలయంలో..

మోపాల్: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. స్వాతంత్ర్యం కోసం, తెలంగాణ ఉద్యమం కోసం ఎంతో పాటు పడ్డారని అన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాల కోసం నిర్విరామంగా కృషి చేశారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాములు నాయక్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. అలాగే బోర్గాం(పి) గ్రామంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పద్మశాలి కులస్తులు ఘనంగా జరుపుకున్నారు.

ఇందల్వాయి: మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ రూరల్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాస్ హాజరై బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఆయన వెంట సంఘ సభ్యులు భాస్కర్, మారుతి, ప్రభాకర్, రాజబాబు, రాజేందర్, రమేష్, రఘువీర్ ఉన్నారు.



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ఉత్సాహంగా యువజనోత్సవ పోటీలు

● **ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే ధన్‌పాల్**

సుభాష్‌నగర్, సెప్టెంబరు 27: భారతదేశ సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన వ్యక్తి స్వామి వివేకానంద అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో జిల్లా క్రీడలు, యువజన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యువజనోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువజనోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. విద్య అంటే చదువు ఒక్కటే కాదని వ్యక్తిలో ఉండే కళానైపుణ్యాలను కూడా విద్యలో భాగమేనన్నారు. తెలంగాణ యాసకు జానపదానికి గొప్ప చరిత్ర ఉందన్నారు. అంతరించిపోతున్న కలలు, జానపద గేయం, నృత్యాలు, కవిత్వం వంటి కళానైపుణ్యాలను వెలికి తీసేందుకు నిర్వహిస్తున్న ఈ యువజనోత్సవాలకు రావడం సంతోషకరంగా ఉందన్నారు. అంతకుముందు యువజనోత్సవాల్లో పాల్గొన్న కళాకారులు తమ నృత్యంతో, గాత్రంతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ముత్తెన్న, నెహ్రూ యువకేంద్రం అధికారి శైలి బెల్లాల్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సాధికారత సంఘం గౌరవ అధ్యక్షురాలిగా ఆకుల లలిత



ఆకుల లలితను అభినందిస్తున్న నాయకులు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 27: రాష్ట్ర బీసీ సాధికారత సంఘం మహిళా గౌరవ అధ్యక్షురాలిగా మాజీ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే ఆకుల లలిత నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గడీల శ్రీనివాస్‌రావు, కొండ దేవయ్య, రాష్ట్ర బిసి కౌన్సిల్ చైర్మన్ కొవ్వూరి భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఆకుల లలితను రాష్ట్ర మహిళా గౌరవ అధ్యక్షురాలిగా నియమించారు. వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు, రాజకీయాల్లో మహిళల కోసం చేస్తున్న అనేక కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకొని ఈ నియామకం చేసినట్లు వారు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో 584 మండలాలు, 12వేలకు పైగా గ్రామాలలో బిసి సంఘాలను కలుపుకొని మహిళా కమిటీలు ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించారు. తనను రాష్ట్ర బిసి సాధికారత సంఘం గౌరవ అధ్యక్షురాలిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళల అభివృద్ధికి అదే విధంగా బిసి మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాసారం రమేష్, వెంకన్న, వేముల తిరుమల దేవి, లక్ష్మణ్, మహేందర్, చలపతిరావు, గంగుల అంజలి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకుల లలితను ఘనంగా సన్మానించారు.

టీయూ భూముల కబ్జా కుట్రలను నివారించాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 27: తెలంగాణ యూనివర్సిటీ భూముల కబ్జా కుట్రలను నివారించాలని కబ్జాదారులకు వత్తాసుపలుకుతున్న రిజిస్ట్రార్ యాదగిరిని సస్పెండ్ చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజా పంథ నగర కార్యదర్శి ఎం.సుధాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు ఐక్యంగా పోరాడితే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం డిచ్‌పల్లిలో తెలంగాణ యూనివర్సిటీని ఏర్పాటు చేసిందన్నారు. 574 ఎకరాల భూములను అప్పటి ప్రభుత్వం యూనివర్సిటీకి కేటాయించిందన్నారు. ఈ భూముల్లో 54 ఎకరాలను కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు తప్పుడు రికార్డులతో కాజేయాలని చూస్తే అప్పటి మంత్రి సుదర్శన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వరప్రసాద్‌లు స్పందించి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వత్తాసు పలుకుతున్న ఎంఆర్‌వోను సస్పెండ్ చేశారని అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోర్టుకు వెళితే కోర్టు సైతం యూనివర్సిటీకే అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. హైకోర్టులో యూనివర్సిటీకి అనుకూలంగా అన్ని రికార్డులు అందించి అందుకు తగ కృషి చేయాల్సిన ప్రస్తుత రిజిస్ట్రార్ యాదగిరి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కొమ్ము కాశారన్నారు. దీంతో 54 ఎకరాల తెయూ భూమి రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతికి అందే పరిస్థితి వచ్చిందన్నారు. యాదగిరి వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని యూనివర్సిటీ భూమిని పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బాధ్యతగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మురళి, సంధ్యారాణి, విఠల్, గంగాధర్, సాయిబాబా పాల్గొన్నారు.

ఎంఆర్‌పీ ధరలకే మద్యం అమ్మాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 27: నిజామాబాద్ జిల్లాలో ఎంఆర్‌పి ధరల కంటే ఎక్కువ ధరలకు మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని ఎంఆర్‌పి ధరలకే మద్యం అమ్మేలా చూడాలని వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈఎస్ మల్లారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు మాట్లాడుతూ జిల్లాలో నాసిరకం మద్యంపై ఫిర్యాదులు వస్తున్నాయని రశీదు లేకుండా జీరో వ్యాపారం జరుగుతుందని అన్నారు. బారులు, మద్యం షాపుల్లో ఎంఆర్‌పి కన్న ఎక్కువ ధరలు వసూలు చేస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఇందూరు వినియోగదారుల వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు వినయ్ వర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, సంయుక్త కార్యదర్శులు మహదేవ్ శ్రీనివాస్, గైని రత్నయ్య, గడప రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్ డివిజన్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్, సెప్టెంబరు 27: నగరంలోని ఒకటవ డివిజన్ ఖానాపూర్ అభివృద్ధికి సాయశక్తులా కృషి చేస్తానని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం ఒకటవ డివిజన్‌లో సుమారు 2కోట్ల 60లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, మురికి కాలువలు, తదితర అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అభివృద్ధి ఏమీ జరగలేదన్నారు. కాంగ్రెస్ హయాంలోనే ఈ గ్రామం అభివృద్ధి చెందిందని అన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి పేదవారికి ఇండ్లు ఇప్పించే విధంగా చూస్తామన్నారు. ఈ ప్రాంతంలో రైస్‌మిల్లులు ఎక్కువగా ఉండటం వల్ల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రామస్థుల కోరిక మేరకు బైపాస్ రోడ్డు పనులు కూడా త్వరలోనే ప్రారంభమయ్యేలా చూస్తానని భరోసా ఇచ్చారు. గ్రామంలో మినరల్ వాటర్ ఏర్పాటు కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ నీతూకిరణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, కార్పొరేటర్ లలిత గంగాధర్, నాయకులు భోజన్న, శేఖర్‌గౌడ్, బాగిర్తి బాగారెడ్డి, అమృతాపూర్ గంగాధర్, పార్టీ అధ్యక్షుడు ఎల్లయ్య, మాజీ వైస్ ఎంపీపీ పూర్ణచందర్, రాజు, హన్మాండ్లు, ఒడ్డెన్న, కొర్వ రాజేంద్రప్రసాద్, మోహన్, జనార్ధన్, సొసైటీ చైర్మన్లు శ్రీనివాస్, శ్రీధర్, వెంకటరెడ్డి, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

క్రీడలతో శారీరక దారుఢ్యం

హీరో ఆకాష్ పూరి జగన్నాథ్
ముగిసిన డీఎస్ స్మారక క్రీడా పోటీలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 27: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం కలుగుతుందని సినీ హీరో ఆకాష్ పూరి జగన్నాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐదు రోజులుగా నిర్వహిస్తున్న డీఎస్ స్మారక క్రీడా పోటీల ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల ద్వారా శక్తి వస్తుందని, ఈ వయస్సులో చేయాల్సిన పను లు చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. జిల్లాకు చెందిన డి.శ్రీనివాస్ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారని మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా ఉండి జిల్లాను అభివృద్ధి చేయడంలో పాత్ర పోషించారని అన్నారు. అనంతరం నిజామాబాద్ స్పోర్ట్స్ ప్రమోషన్ చైర్మన్ ధర్మపురి సంజయ్ మాట్లాడుతూ.. ఈ క్రీడలను నిర్వహించడం మా నాన్నకు ఇచ్చే బహుమతి అన్నారు. యేటా ఈ క్రీడలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆకాష్ పూరి జగన్నాథ్, సంజయ్‌లు కలిసి విజేతలకు బహుమతులను అందజేశారు. అంతకుముందు విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, మెజీషియన్ చేసిన మ్యాజిక్‌లు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినిమా జర్నలిస్టు సురేష్ కొండేటి, నిజామాబాద్ స్పోర్ట్స్ ప్రమోషన్ కార్యదర్శి గౌతమ్, సభ్యులు ధర్మపురి సురేందర్, శోభ, డి.సాయిలు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆకాష్



విజేతలకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

విజేతలు వీరే..

ఖోఖో హైస్కూల్ బాలుర విభాగంలో మొదటి విజేత ఎంజేపీ కంజర, రెండవ బహుమతి టిజిఎంఆర్ఎస్ చందూర్, కబడ్డీ జూనియర్ కాలేజీ బాలుర విభాగంలో విన్నర్ ఎంజెపి ధర్మారం, రన్నర్స్ టిఎంఆర్ఎస్ నిజామాబాద్, కబడ్డీ జూనియర్ కాలేజీ బాలికల విభాగంలో టిటిడబ్ల్యుయుఆర్‌జెసి ఇందల్వాయి, రన్నర్స్ ఎంజెపిటిజెసి దాస్‌నగర్, కబడ్డీ హైస్కూల్ బాలుర విభాగంలో విన్నర్స్ కాకతీయ ఒలంపియాడ్, రన్నర్స్ ఎంజెపి ధర్మారం, కబడ్డీ హైస్కూల్ బాలికల విభాగంలో టిటిడబ్ల్యుఆర్ఎస్ ఇందల్వాయి, రన్నర్స్ టిజిఆర్ఎస్ పోచంపాడ్, బాస్కెట్‌బాల్ హైస్కూల్ బాలుర విభాగంలో విన్నర్స్ నిర్మల హృదయ హైస్కూల్ నిజామాబాద్, రన్నర్స్ ఇందూరు హైస్కూల్ నిజామాబాద్, బాస్కెట్ బాల్ హైస్కూల్ బాలికల విభాగంలో విన్నర్స్ నిర్మల హృదయ హస్కూల్, రన్నర్స్ ఇందూరు హైస్కూల్ నిజామాబాద్.

30న తైక్వాండో అండర్-14 బాల బాలికల ఎంపికలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 27: ఈనెల 30న తైక్వాండో అండర్-14 బాల బాలికల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 1న అండర్-17 బాల బాలికల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని డిఎస్ఏ స్విమ్మింగ్ పూల్ మైదానంలో ఉదయం 9గంటల నుంచి ఎంపికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తైక్వాండో సేఫ్టీ సామాగ్రి వెంట తెచ్చుకోవాలని అన్నారు. మిగతా వివరాల కోసం 7097047036 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ముగిసిన రేషన్ డీలర్ల రాత పరీక్ష

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 27: నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 38 రేషన్ దుకాణాల డీలర్ల భర్తీ కోసం శుక్రవారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఉదయం 10.30ల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు రాత పరీక్ష నిర్వహించారు. 418 మంది దరఖాస్తులు చేసుకోగా 393 మంది హాజరు కాగా 25 మంది గైర్హాజరయ్యారు. రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి రేషన్ డీలర్లుగా ఎంపిక చేయనున్నారు.

త్వరలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం

● **ఐడీసీఎంఎస్ చైర్మన్ తారచంద్‌నాయక్**

ఖిల్లా, సెప్టెంబరు 27: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని ఐడీసీఎంఎస్ చైర్మన్ తారచంద్‌నాయక్ అన్నారు. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ప్రధాన కార్యలయంలో శుక్రవారం 56వ మహాసభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఐడిసిఎంఎస్, ఎన్‌డిసిసిబి రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడే సమస్య అయిన గోనేసంచుల సరఫరాలో ఉందన్నారు. ధాన్యం కొనుగోలు కమీషన్‌ను వెంటవెంటనే రైతులందరికి విడుదల చేయడం జరుగుతుందన్నారు. రైతులందరికి 100శాతం రుణమాఫీ వర్తింపు అయ్యేలా చూడాలని సభ్యులు సభ దృష్టికి తీసుకరాగ సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో ఎన్‌డిసిసి చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి,ఐడిసిఎంఎస్ వైస్ చైర్మన్ ఏదుళ్ల ఇంద్రసేనారెడ్డి, డైరక్టర్లు పి.సాయన్న, శ్రీనివాస్ గౌడ్, కపిల్‌రెడ్డి, రాజేశ్వర్,రాజాగౌడ్, జిల్లా సహకార అధికారిఎన్.శ్రీనివాస్‌రావ్, మేనేజర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కృషి

ఖిల్లా, సెప్టెంబరు 27 : తమ తమ పరిధుల్లో నేరాల నియంత్రణకు కృషి చేస్తామని ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి, నగర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రాజ్‌లు అన్నారు. బదిలీపై వచ్చిన వారు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కల్గించే వారు ఎవరైనా సరే ఉపేక్షించబోమన్నారు. ప్రజలు పోలీసు శాఖ నియమ నిబంధనలు పాటించాలని అన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలను అందిస్తామన్నారు. పేకాట కు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తి లేదన్నారు. దొంగతాలు జరుగకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు కూడా పోలీసు శాఖకు సహకరించాలన్నారు. రానున్న దసరా పండుగ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి వదంతులను నమ్మవద్దన్నారు. అనుమానితులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. అనంతరం నిజామాబాద్ ఏసీపి.ఎల్.రాజవెంకటరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శుభకాంక్షలు తెలిపారు.



సీఈవోను ప్రశ్నిస్తున్న రైతు మోహన్

సొసైటీ మహాజన సభ రసాభాస


● **సొసైటీలో అవకతవకలపై రైతుల ఆగ్రహం**
● **నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్**

ఇందల్వాయి, సెప్టెంబరు 27: ఇందల్వాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ రసభసగా మారింది. శుక్రవారం సొసైటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన ఇందల్వాయి రామాలయం ఆవరణలో ప్రారంభమైన సమావేశంలో ముందుగా సిఈవో రతన్ గత ఆరు నెలల్లో జరిగిన లావాదేవీల జమ ఖర్చుల వివరాల గురించి చదివి వినిపించారు. సభ ప్రారంభమైన కొద్దిసేపటికే సొసైటీలో జరిగిన అవకతవకల గురించి రైతులు పాలకవర్గ సభ్యులను ప్రశ్నించారు. జూలై 27న ఆంధ్రజ్యోతి దిన పత్రికలో సొసైటీలో భారీ అవినీతి ఆరోపణలు అని ప్రచురితమైన శీర్షికను రైతులు పేపర్లు పట్టుకొని నినాదాలు చేశారు. దీనిపై సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. జిల్లాలో నెంబర్ వన్ స్థానంలో ఉన్న సొసైటీని అవినీతి ఆరోపణలతో భ్రష్టు పట్టించారని దీనికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అవినీతి ఆరోపణలపై సెక్షన్ 51 విచారణకు ఆదేశిస్తూ డిమాండ్ చేశారు. సిఈవో రతన్ పెద్ద ఎత్తున నిధులు గోల్‌మాల్‌కు పాల్పడ్డాడని అతన్ని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అతని కారణంగా 16 మంది రైతులు రుణమాఫీకి దూరమయ్యారని మరికొంత మంది రైతులు రుణాలు చెల్లించిన డబ్బులను తన ఖాతాలో జమ చేసుకున్నట్లు ఆరోపించారు. సిఈవో నిర్లక్ష్యం వల్ల రుణమాఫీకి దూరమైన రైతులకు అతనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రజ్యోతి పత్రికలో అవినీతి ఆరోపణలు అని వెలువడిన రెండు మూడు రోజుల్లోనే సిఈవో రతన్ ఏడున్నర లక్షలు బ్యాంకులో జమ చేశారని అతను అక్రమాలకు పాల్పడకుంటే వాడుకున్న నిధులు ఎలా జమ చేస్తారని ప్రశ్నించారు. సొసైటీ బిల్డింగ్ నిర్మాణం, ప్యాడీ కమీషన్, గన్నీ బ్యాగులలో అవకతవకలు జరిగాయని వీటన్నింటికి సిఈవోనే కారణం అన్నారు. సొసైటీలో నిధులు గోల్‌మాల్ అవుతున్నాయని డిసివోకు ఫిర్యాదు చేసిన డైరెక్టర్లు విచారణకు ఆదేశించకుండా ఎందుకు వెనక్కి తగ్గారని రైతులు పాలకవర్గం సభ్యులను ప్రశ్నించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ మారుతి, ఎన్‌డిసిసి డైరెక్టర్ ఆనంద్, సొసైటీ డైరెక్టర్లు మల్లరెడ్డి, దాసు, తాళ్ల రాజు, గంగారెడ్డి, నామాల గంగాధర్, రాంరెడ్డి, బాలవ్వ, గంగామణి, తదితరులు ఉన్నారు.


అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

ధర్పల్లి, సెప్టెంబరు 27: అర్హులందరికీ ప్రభుత్వం రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. శుక్రవారం ధర్పల్లి సింగిల్ విండో మహాజన సభ చైర్మన్ మల్లికార్జున్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిఈవో సంతోష్‌రెడ్డి జమ ఖర్చులను వివరించారు. అనంతరం రైతులు మాత్రం అరకొర రుణమాఫీతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సగానికి పైగా రైతులకు రుణమాఫీ అందలేదని అర్హులైన వారందరికి రుణమాఫీ వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు ఖరీఫ్ నుంచి బోనస్‌ను ఇవ్వాలని సభ దృష్టికి తెచ్చారు. కొనుగోలు కేంద్రాలు సకాలంలో తెరవాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు ఇప్పటి నుంచే తీసుకుంటున్నట్లు చైర్మన్ మల్లికార్జున్ సభ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీనివాస్ నాయక్, మాజీ సర్పంచ్ మిట్టపల్లి గంగారెడ్డి, సుభాష్, సింగిల్ విండో సిబ్బంది రంజిత్, గంగబాపు, అనిల్, రైతులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.85	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	: రూ.95	రూ.205	రూ. 225



బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.78400	రూ.72300	రూ.945

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : దేవర (11.15, 2.50, 6.25, 10.00)
స్క్రీన్-2 : దేవర (12.15, 3.50, 7.25, 11.00)
స్క్రీన్-3 : మత్తు వదలరా-2 (12.00, 3.00, 6.00, 9.00)
స్క్రీన్-4 : సత్యం సుందరం (11.00, 2.40, 6.20, 10.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : దేవర (9.10, 12.20, 3.40, 7.00, 10.20)
స్క్రీన్-2 : దేవర (1.30, 7.30, 10.40)
స్క్రీన్-3 : సత్యం సుందరం (12.35, 4.00, 7.20, 10.40)



దేవి : సత్యం సుందరం (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : దేవర (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : దేవర (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: దేవర (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్